ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 32.0
కనిష్టం : 26.0

30 మంది టీచర్ల బదిలీలు రద్దు ! -7లో

గండం పొంచే ఉంది..



వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట వద్ద వరద నీటిలోనే పంట పొలాలు

- తగ్గుముఖం పట్టిన గోదావరి
- వరద నుంచి బయటపడుతున్న గ్రామాలు
- పోలవరం స్పిల్‌వే నుంచి 11,78,184 క్యూసెక్కుల వరద జలాలు విడుదల
- గోదావరి ఎగువన భారీ వర్షాలు
- మరో రెండు రోజుల్లో మళ్లీ వరదలకు అవకాశం

వేలేరుపాడు/ కుక్కునూరు/ పోలవరం, జూలై 29 : భద్రాచలం వద్ద గోదావరి నెమ్మదిగా తగ్గుముఖంపట్టింది. సోమవారం ఉదయం 45.40 అడుగుల నీటిమట్టం ఉండగా సాయంత్రం 6గంటలకు 43.10 అడుగులు నీటిమట్టం ఉండగా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. శబరి నది ఎగపోటు కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి నెమ్మదిగా తగుతోంది. అయితే మహారాష్ట్రలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరికి భారీగా వరద చేరుకుంటోందని దాని ప్రభావంతో మరలా గోదావరికి వరదపోటెత్తే ప్రమాదం ఉందని ముంపు మండలాల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- వరద ముంపునకు గురైన వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. మండలంలో 30 గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వరద కారణంగా ముంపు నకు గురైన ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను తొలగించే పనిలో ఆయా గ్రామాల ప్రజలు నిమగ్నమయ్యారు. వరద నీటి నుంచి రహదారులు బయట పడకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పడవల పైనే ప్రయాణించి సరుకులు కొనుగోలు చేసి గ్రామాలకు తిరిగి వెళ్తున్నారు.
- కుక్కునూరు మండలంలో ముంపునకు గురైన గ్రామాల నుంచి పునరావాస కేంద్రాల్లో 480 కుటుంబాలు ఉన్నాయి. వారందరికీ రూ.3వేలు నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు ప్రభుత్వ యంత్రాంగం అందించింది. గోదావరి తగ్గుముఖం



కుక్కునూరులోని గుండేటివాగు తీరంలో తగ్గుముఖం పట్టిన గోదావరి

పట్టడంతో వింజరం వద్ద గోదావరి వరద తగ్గడంతో భద్రాచలం వైపు రాకపోకలు ప్రారంభమయ్యాయి. జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య నిర్వాసితుల కాలనీలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.337 మీటర్లకు చేరుకున్నట్టు, 11,78,184 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 15.02 మీటర్లకు చేరుకుందని, 14,71,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేయగా రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉన్నట్టు ధవళేశ్వరం బ్యారేజి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు రమేష్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 12,27,394 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేస్తున్నట్టు ఈఈ మల్లికార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.460 మీటర్లు, స్పిల్‌వే దిగువన 25.200 మీటర్లు నమోదైనట్టు ఈఈలు తెలిపారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టుకి వెళ్లే ప్రధాన మార్గమైన కడెమ్మ వంతెన నీట మునిగి వంతెనపై నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. పట్టిసీమ వద్ద కొండవాగుల జలాలు కొవ్వాడ కాల్వ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి వేగంగా గోదావరిలోకి ప్రవహించడానికి వీలుగా 23 స్లూయిజ్ గేట్లు పూర్తిగా ఎత్తి జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ కాలువ రిజర్వాయర్ వద్ద 88.05 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా 220 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఏఈఈ కొండలరావు తెలిపారు. గోదావరి నీటిమట్టం 24.153 మీటర్లకు పైబడి ఉందని, పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 17 పంపులు 17 మోటార్లతో 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పోలవరం మండలంలో 830 ఎకరాల వరి నాట్లు ముంపుకు గురయ్యాయని , 45 రోజుల వ్యవధి పంటకు ఎలాంటి పంట ఇన్‌పుట్ సబ్సిడీ రాదని, 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తామని, 15 క్వింటాళ్ళ వరి విత్తనాల కోసం వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కి నివేదిక పంపినట్టు మండల వ్యవసాయాధికారి రాంబాబు తెలిపారు.

దెబ్బతిన్న పంటలు.. వశిష్టకు వరద పోటు

అచంట/యలమంచిలి/నరసాపురం టౌన్ : ఆచంట మండలం అయోధ్యలంక, పెదమల్లం లంక, కోడేరు లంకలు ముంపు నుంచి బయట పడకపోవడంతో అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం నీట మునిగింది. వరద ఉధృతి ఎక్కువగా వున్న కారణంగా గోదావరిలో పడవల రాకపోకలు నామమాత్రంగా జరుగుతున్నాయి. వరద పరిస్థితిని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీవో నరసింహప్రసాద్, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. యలమంచిలి మండలం కనకాయ లంక, పెదలంక, యలమంచిలి లంక ప్రజలు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. వశిష్ఠ గోదావరికి వరద పోటు తగ్గక పోవడంతో నరసాపురంలోని వలంధర్ రేవు, లలి తాంబ, కొండాలమ్మ రేవులు నీట మునిగాయి. పట్టణం నుంచి గోదావరిలోకి వెళ్లే డ్రైనేజీని మూసివేయడంతో మురుగు నీరు బయటకు వెళ్లడం లేదు. చలవపేట, పొన్నపల్లి, శ్రీహరిపేట కాలనీ, కుళాయి చెరువు వద్దకు నీరు నిల్వ ఉండిపోయింది. మండలంలోని ఎస్టీ కాలనీలో మోకాలు లోతు వరద నీరు చేరింది. మార్కెట్ యార్డు మైదానం వరద నీరుతో మునిగింది. పంట కాల్వలోకి వరద నీరు చేయడంతో కాల్వ లీకేజీల గుండా నీరు పల్లపు ప్రాంతాలకు చేరింది. వందలాది ఎకరాలు చెరువులను తలపిస్తున్నాయి.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 29 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా నూజివీడు మండలంలో 38.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 9.6 మి.మీ నమోదైంది. పెదవేగి 28.6, దెందులూరు 22.4, నిడమర్రు 19.2, లింగపాలెం 16.2, భీమడోలు 14.6, వేలేరుపాడు 13, కామవరపుకోట 12.4, చింతలపూడి 12.2, కొయ్యలగూడెం 11.8, ఏలూరు రూరల్ 10.2, కుక్కునూరు 10.2, ఉంగుటూరు 9.8, ద్వారకా తిరుమల 8, ఏలూరు అర్బన్ 6.4, ముసునూరు 6.2, చాట్రాయి 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 5 మి. మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదు అయింది.

200 ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ల నిర్వాహకులకు నోటీసులు

- ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయిందంటూ ప్రజలను దోచుకుంటే సహించం
- ఆర్ఎంపీలు, పీఎంపీలు, కాంపౌండర్లకు డెంగీ ఫీవర్లను నిర్ధారించే అర్హతల్లేవు
- డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ



చనుబండలో వైద్యశిబిరం తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ

ఏలూరు అర్బన్/ చాట్రాయి, జూలై 29 : 'సీజన్ మార్పిడి సమయంలో సాధారణంగా వ్యాప్తి చెందే వైరల్ జ్వరాలను కూడా గ్రామీణ ప్రాంతాల్లోని కొందరు పీఎంపీలు, ఆర్ఎంపీలు, సాధారణ కాంపౌండర్లు అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయినట్టుగా నమ్మబలుకుతూ దోచుకుంటున్నారు' అని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఆందోళన వ్యక్తం చేశారు. డెంగీ నిర్ధారణకు వైద్యపరమైన హక్కులులేని పీఎంపీలు, ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న సుమారు 200 ఫస్ట్ ఎయిడ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశామన్నారు. జిల్లాలోని చాట్రాయి మండలం చనుబండ గ్రామాన్ని సోమవారం సందర్శించిన డీఎంహెచ్‌వో స్థానికంగా ప్రబలుతున్న వైరల్ జ్వరాలను డెంగీ ఫీవర్లుగా అనర్హులైన పీఎంపీలు, ఆర్ఎంపీలు నిర్ధారించడాన్ని తప్పుబట్టారు. ఆమె మాట్లాడుతూ.. 'వాస్తవానికి చనుబండలో చికున్ గున్యా ఇన్‌ఫెక్షన్లు మాత్రమే కొందరికి ఉన్నాయి. ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్‌ల నిర్వాహకులు వైరల్ జ్వరాలతో తమవద్దకు వచ్చే పేషెంట్లకు అత్యధిక డోస్‌తో కూడిన హైఎండ్ టాక్సిన్ ఇంజక్షన్లు, ట్యాబ్లెట్లు ఇవ్వడం వల్ల సాధారణంగానే ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గడానికి కారణమైంది. తీవ్ర తలనొప్పి, వాంతులు, ఎముకల నొప్పులు, తీవ్ర శరీర ఉష్ణోగ్రతలు, తెల్లచర్మం గలవారికి శరీరంపై గులాబీరంగు మచ్చలు వస్తే డెంగీ అనుమానిత లక్షణాలుగా భావించాలి. ఈ లక్షణాలువున్న రోగులకు తొలుత ఎన్ఎస్ఎం టెస్టు నిర్వహించి పాజిటివ్ వస్తే అనంతరం తుదిపరీక్ష అయిన ఎలీజా టెస్టులోను పాజిటివ్ వస్తే దానిని డెంగీ జ్వరంగా నిర్ధారించాల్సి ఉంటుంది. డెంగీ జ్వరం ఒక్కరోజులో తగ్గిపోయేది కాదు. కనీసం వారం రోజుల పాటు ఉంటుంది. ఇవేవీ లేకుండానే గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీలు, ఆర్ఎంపీలు, కాంపౌండర్లు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లు నిర్వహిస్తూ శాస్త్రీయమైన రోగనిర్ధారణ పరీక్షలు లేకుండా ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయిందంటూ రోగుల నుంచి ప్యాకేజీల రూపంలో దోచుకుంటున్నారు. స్థానికంగానే కాకుండా విజయవాడ తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చి ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయిందంటూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్యాకేజీలతో డబ్బులు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి అధిక మోతాదులో రోగికి మందులు ఇస్తే ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోవడం సహజంగా జరుగు తుంది. ఆరోగ్యవంతమైన మనిషి శరీరంలో సాధారణంగా 3 లక్షలు ప్లేట్‌లెట్లు ఉంటాయి. అవి 40 వేల కంటే తగ్గితే వైద్యం అవసరం. 20 వేల కంటే తగ్గితే రీప్లేస్‌మెంట్‌కు వెళతాం. దీనికి భిన్నంగా పెదవేగి మండలం విజయరాయిలో సోమవారం సాయంత్రం ఓ కేసు నా దృష్టికి వచ్చింది. సంబంధిత రోగికి 80 వేల ప్లేట్‌లెట్లు ఉన్నట్టుగా వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినప్పటికీ, అతనికి ప్లేట్‌లెట్లు అవసరమని భయభ్రాంతులకు గురిచేయడాన్ని మోసంగా పరిగణించి తక్షణమే స్థానికంగా వున్న ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌ను మూసివేయాల్సిందిగా నోటీసు జారీ చేశాం. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో డెంగీ ఫీవర్ నిర్ధారణకు వైద్య పరీక్షలు ఉచితంగానే చేస్తున్నాం. రోగులకు పంపిణీ చేసేందుకు మందులు పూర్తిస్థాయిలోనే ఉన్నందున వైరల్ ఫీవర్ల బారినపడిన వారెవ్వరూ పీఎంపీలు, ఆర్ఎంపీలు, కాంపౌండర్లను ఆశ్రయించి డబ్బులు పోగొట్టుకోవద్దు' అంటూ హితవు పలికారు.

జ్వరంతో మహిళ మృతి

చాట్రాయి మండలం చనుబండలో వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న కంచు రామపుల్లమ్మ (33) విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. జ్వరం వచ్చిన తర్వాత నాలుగు రోజుల పాటు స్థానిక వైద్యుడి దగ్గర చికిత్స పొందినా తగ్గక పోవడంతో కుటుంబ సభ్యులు విస్సన్నపేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్లేట్‌లేట్స్ పడిపోవడంతో ఆదివారం ఆమెను విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ

- సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ అందజేత .. అధికారుల ఏర్పాట్లు
- జిల్లాలో 2.66 లక్షల మంది.. పెన్షన్ సొమ్ము రూ. 113.99 కోట్లు

ఏలూరుసిటీ, జూలై 29: జిల్లాలో ఆగస్టు నెల పింఛన్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో అసాధ్యం కాదన్నది , ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు సుసాధ్యం చేసి చూపించారు. కేవలం సచివాలయ సిబ్బందితోనే ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయడంలో సఫలీకృతులయ్యారు. జూలైలో పెంచిన పింఛన్ మొత్తాన్ని బకాయిలతో పాటు పంపిణీ చేశారు. ఇక అదే విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఆగస్టులో కూడా ఒకటో తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికీ పంపిణీ చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వృద్ధులు, వితంతవులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున పింఛన్‌లు అందజేయనున్నారు. జిల్లాలో దాదాపు 1,050 మంది సిబ్బంది ఈ పింఛన్లు పంపిణీ చేయనున్నారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 2,66,867 మంది ఉండగా వీరికి 113 కోట్ల 99లక్షల 31వేల 500 రూపాయలు పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లాలోని లబ్ధిదారులకు తొలి రోజునే పింఛన్ అందించేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు.

ఒకటినే పింఛన్‌లు అందించాలి : కలెక్టర్

జిల్లాలోని పింఛన్‌దారులందరికీ ఆగస్టు 1వ తేదీనే పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు దిశనిర్దేశం చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పంపిణీ చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఎంపీడీవోలతో సమీక్షించారు. పింఛను డబ్బులను ఈ నెల 31వ తేదీన డ్రా చేసి సిద్ధంగా ఉంచుకోవాలని, ఒకటో తేదీ ఉదయం 6గంటల నుంచి పంపిణీ చేపట్టి నూరుశాతం పంపిణీకి సమన్వయంతో పని చేయాలన్నారు.

మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు

మండలం పేరు	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ సొమ్ము
చింతలపూడి	9,532	4,07,22,500
చింతలపూడి అర్బన్	2,826	1,22,89,000
జంగారెడ్డిగూడెం	8,993	3,88,34,000
జంగారెడ్డిగూడెం అర్బన్	4,903	2,10,28,500
కామవరపుకోట	8,157	3,44,01,500
లింగపాలెం	8,036	3,44,81,000
దెందులూరు	9,595	4,18,19,500
ఏలూరు	5,347	2,29,29,500
పెదపాడు	9,452	4,02,87,500
పెదవేగి	12,166	5,30,64,000
ఏలూరు అర్బన్	28,846	12,54,17,000
ద్వారకాతిరుమల	9,914	4,26,29,000
కైకలూరు	9,515	4,06,30,500
కలిదిండి	9,719	4,11,88,500
మండవల్లి	6,947	2,91,92,500
ముదినేపల్లి	9,022	3,82,57,000
ఆగిరిపల్లి	9,771	4,18,87,500
చాట్రాయి	8,497	3,54,32,000
ముసునూరు	7,973	3,34,19,000
నూజివీడు	10,581	4,47,30,000
నూజివీడు అర్బన్	5,279	2,25,65,500
బుట్టాయిగూడెం	7,066	2,93,81,000
జీలుగుమిల్లి	4,308	1,82,36,000
కొయ్యలగూడెం	10,354	4,44,38,000
కుక్కునూరు	5,364	2,25,66,000
పోలవరం	6,713	2,84,05,000
టి.నరసాపురం	7,817	3,33,75,000
వేలేరుపాడు	3,234	1,34,58,500
భీమడోలు	8,995	3,87,55,000
నిడమర్రు	6,319	2,64,42,000
ఉంగుటూరు	11,626	4,96,69,500
మొత్తం	2,66,867	113,99,31,500

మత్తు..మత్తుగా



గతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

కైకలూరులో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

- విద్యార్థులే లక్ష్యంగా దందా
- పోలీసుల అదుపులో పలువురు యువకులు
- వారిపట్ల ఉదాసీన వైఖరిపై విమర్శలు

కైకలూరు జూలై 29 : యువత ఈజీగా డబ్బు సంపాదించాలని సులభమైన మార్గాలను ఎంచుకుంటూ విలాసవంతమైన జీవితాలను గడిపేందుకు గంజాయి రవాణాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా విచ్చలవిడిగా గంజాయి రవాణా జరుగుతున్నట్టు అనేక వార్తలు వెలుగు చూసిన సరైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం గంజాయి కైకలూరు ప్రాంతాన్ని చుట్టేస్తోంది. అది కూడా వైసీపీకి చెందిన కొందరు నాయకుల కుమారులు, బంధువులు గంజాయి రవాణా చేస్తూ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

కైకలూరుకు చెందిన ఒక వైసీపీ నాయకుడి కుమారుడు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ లక్షలు ఖరీదు చేసే ద్విచక్ర వాహనం, ఐఫోన్లు వాడుతున్నాడు. అనతికాలంలోనే లక్షలు చేతికి రావడంతో వారు చేసే అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. గంజాయి తాగడాన్ని ప్రారంభించిన వ్యక్తే రవాణా చేసే స్థాయికి ఎదిగి లక్షలు చేజిక్కించుకుంటున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి రూ.5 వేలు గంజాయి తీసుకొచ్చి సుమారుగా రూ.2.5 లక్షలు సంపాదిస్తున్నట్టు సమాచారం. అతని సెల్ ఫోన్లో ఫోన్‌పే, గూగుల్‌పేల్లో ఆన్‌లైన్ పేమెంట్లు వందల కొద్ది ఉంటాయని తెలుస్తోంది. 100 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను వారు రూ.200కి కొనుగోలు చేసి ఇక్కడ రూ.వెయ్యికి అమ్మకాలు చేస్తున్నట్టుగా సమాచారం. ఈ దందాలో కలిదిండి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఒక వ్యక్తికి గంజాయి కావాలంటే డబ్బులు ఆన్‌లైన్లోనే చెల్లించాలి. అతని సెల్‌ఫోన్ చూసిన పోలీసులు సైతం కంగు తిన్నట్టు సమాచారం. కైకలూరు పరిసర ప్రాంతాల నుంచి వందలాది యువకులు గంజాయికి బానిసలుగా మారారు.

సుమారు వారం రోజుల క్రితం గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన వివరాల ఆధారంగా కేసు విచారణ చేసిన పోలీసులకు భారీగా గంజాయి రవాణా జరుగుతున్నట్టు తెలిసి ఆ దిశగా అడుగులు వేశారు. కలిదిండి ప్రాంతానికి చెందిన వ్యక్తే కీలకపాత్ర పోషిస్తున్నాడని గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అతనితోపాటు కైకలూరులో వైసీపీ నాయకుని కుమారుడు నుంచి పోలీసులు సమాచారాన్ని సేకరించారు. అయితే ఎనిమిది రోజులుగా అనేకమంది యువకులను విచారణ చేసి గంజాయి రవాణాలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారని తెలిసినా అరెస్టు చేయకుండా పోలీసులు ఉదాసీనత వైఖరితో వ్యవహరించడంతో దర్జాగా రోజూ ఇంటికి వెళ్లి భోజనాలు చేసి రాత్రివేళల్లో రోడ్లవెంబడి తిరుగుతూ పోలీసులు మమ్మల్ని ఏం చేస్తారంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. కైకలూరు, కలిదిండి రెండు మండలాల్లో సుమారు 30 కేజీల గంజాయి దొరికినట్టు సమాచారం. 40 మంది యువకులకు పైగా వివిధ పోలీసుస్టేషన్లకు తీసుకువెళ్లి విచారణ చేసి వారి నుంచి ఆధారాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా ప్రధాన పాత్ర పోషిస్తున్న యువకులను ఇళ్లకు పంపించడం పట్ల పోలీసులు తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది. కైకలూరు నుంచి వివిధ ప్రాంతాల్లోని కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న యువకుల్లో అనేకమంది గంజాయికి అలవాటుపడి ఆ మత్తులో వారు ప్రయాణించే బస్సులో మహిళలు, తోటి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు సమాచారం. దీంతో విద్యార్థినులు భయం భయంగా కళాశాలలకు వెళ్లవలసి వస్తోందని వాపోతున్నారు.

విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు

హైస్కూల్, కళాశాల విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి విక్రయాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తుల ద్వారా గంజాయి విక్రయాల సమాచారాన్ని అందించి నెమ్మదిగా ఊబిలోకి దింపుతున్నారు. ఏలూరు, భీమవరం ప్రధాన కేంద్రాలుగా కైకలూరు ప్రాంతానికి భారీగా గంజాయిని తరలించి నిరంతరంగా అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పలువురు విద్యార్థులు, యువత గంజాయి తాగుతూ తల్లిదండ్రులకు పట్టుబడిగా గంజాయి మత్తులో వారిపైనే ఎదురుతిరిగిన ఉదంతాలు అనేకం చోటు చేసుకున్నాయి. ఇంత పెద్దఎత్తున గంజాయి వ్యాపారం జరుగుతున్నప్పటికీ ఆదిలోనే అరికట్టాల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతో భారీస్థాయిలో గంజాయి విక్రయాలు కైకలూరులో చోటు చేసుకున్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు పూర్తిస్థాయిలో గంజాయిని అరికట్టాలని కోరుతున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

- కలెక్టర్ వెట్రిసెల్వి.. 211 అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, జూలై 29 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా స్వీకరిస్తున్న ప్రజల అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్వో ముక్కంటి, ఆర్డీవో ఖాజావలీతో కలిసి ప్రజల నుంచి మొత్తం 211 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల పరంగా సమస్యలుంటే తక్షణం వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని, నాణ్యతతో కూడిన పరిష్కారాన్ని అర్జీదారులు చూపాల న్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అర్జీలు అందజేసిన వారిలో .. ధాన్యం కొనుగోలు చేస్తే నేటివరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి నగదు చెల్లించలేదని, రావాల్సిన సొమ్మును అందించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన గోలి నర్సిరెడ్డి, దివ్యాంగుడైన తన కుమారుడికి 2014 వరకు పెన్షన్ అందిందని, తదుపరి వేలిముద్రలు, ఐరిష్ పడడం లేదని పింఛన్ ఆపేశారని దివ్యాంగులకు పింఛన్ ఇవ్వాలని కోరుతూ ద్వారకా తిరుమలకు చెందిన కొండూరు పార్వతమ్మ, తన భూమికి ఆన్‌లైన్‌లో వేరేవారి పేరు నమోదైందని, ఆ పేరు తొలగించాలని పంగిడిగూడెంకు చెందిన రంగారావు అర్జీలు అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఏలూరు సిటీ : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉచిత ఇసుక విధానంపై సమీక్షించారు. పూర్తి పారదర్శకతతో ఎక్కడయినా అమలు కావాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద 24 గంటలూ పనిచేసే విధంగా సీసీ కెమేరాలు, సిబ్బంది తప్పనిసరిగా ఉండాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గనుల శాఖ అధికారులు, సంబంధిత తహసీల్దార్లు ప్రతి రోజు తప్పనిసరిగా ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించాలన్నారు.

60 ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ



ఏలూరు క్రైం : ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 60 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి వాటిని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చట్ట ప్రకారం సత్వరమే సమస్యలు పరిష్కరించడానికి సంబంధిత పోలీస్ అధికారులకు అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదు దారులను ఉద్దేశించి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. ఏఎస్పీ స్వరూపరాణి, డీఎస్పీ శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



చినవెంకన్న క్షేత్రంలో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల, జూలై 29: ద్వారకాతిరుమల క్షేత్రంలో సోమవారం డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణం, మండపాలు యాత్రికులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో తనిఖీలను చేపట్టారు. హెచ్‌సీ సుగుణారావు వీరా సర్ పేరుతో ఉన్న డాగ్‌తో తనిఖీ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్ బృంద సభ్యులు ఎస్.ఆంజనేయులు తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రధాన ఆలయాల తనిఖీల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు బృంద సభ్యులు తెలిపారు.

సెల్‌ఫోన్ కౌంటర్ వేలం ద్వారా రూ.50 లక్షల ఆదాయం



ద్వారకాతిరుమల, జూలై 29: ద్వారకాతిరుమల శ్రీవారికి సెల్‌ఫోన్ కౌంటర్ ద్వారా ఏడాదికి రూ. 50 లక్షల మేర ఆదాయం లభించింది.పాదుకా మండపం వద్దనున్న పాత కల్యాణమండప ఆవరణలో సోమవారం ఆలయానికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్‌లను భద్రపరిచే హక్కుకు ఏడాది కాలానికి జరిగిన బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన సీహెచ్ రాజేష్ రూ.50 లక్షలకు పాడాడు. గతంలో రెండేళ్ల కాలానికి రూ. 19.9 లక్షలు ఆదాయం రాగా ఇప్పుడు ఏడాదికి భారీ స్థాయిలో ఆదాయం లభించింది. ఈ ఏడాది అక్టోబరు 6 వరకూ పాత పాటదారుడికి కాలం ఉండగా కొత్త పాట దారుడు అక్టోబరు 7 నుంచి హక్కు పొందుతాడు.



కనకదుర్గమ్మకు సారె అందించేందుకు వెళ్తున్న అధికారులు, అర్చకులు

విజయవాడ దుర్గమ్మకు స్వామివారి ఆషాఢం సారె

ద్వారకాతిరుమల, జూలై 29: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గమ్మకు ద్వారకాతిరుమల దేవస్థానం తరఫున ఆషాఢ మాస సారెను సోమవారం అందజేశారు. ద్వారకాతిరుమల నుంచి అధికారులు, అర్చకులు అక్కడకు వెళ్లి అమ్మవారికి సారెగా పట్టుచీర, పూలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. ముందుగా ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు, ప్రధాన అర్చకులు పెద్దింటి భాను, ఉప ప్రధానార్చకులు కొండూరి జనార్ధనాచార్యులు తదితరులు విజయవాడ వెళ్లి అమ్మవారికి సారె అందించి ప్రత్యేక పూజలు చేశారు. ఇంద్రకీలాద్రి దేవస్థానం ఈవో రామారావుకు చినవెంకన్న ప్రసాదం, చిత్రపతం ఇచ్చి సత్కరించారు.

పటిష్టమైన ప్రణాళికలతోనే అంకుర పరిశ్రమల అభివృద్ధి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 29 : అంకుర పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే పటిష్టమైన ప్రణాళికలు , వ్యూహాలను కల్గి ఉండాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం విశాఖపట్నం) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సమీమ్ జావెద్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ ఎంఎస్‌మూర్తి ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఏంజెల్ ఇన్వెస్ట్ మెంట్ వీసీ ఫండింగ్ అపర్చునిటీ అనే అంశం పై సోమవారం ఆన్‌లైన్ ద్వారా వర్క్‌షాప్ నిర్వహించారు. నిట్ డీన్ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ శ్రీఫణికృష్ణ పీ.శంకర్, డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ సుదర్శన దీప, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్జీ ఆడుకుంటూ.. విధి నిర్వహణ

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశాలు



బుట్టాయగూడెం, జులై 29 : విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని విద్యా శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎం.సాయిశ్రీ కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమ వారం కెఆర్ పురంలోని డీవైఈవో కార్యా లయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే తనిఖీ సమయంలో సాయిశ్రీ కిరణ్ విధులను పక్కనపెట్టి సెల్‌ఫోన్‌లో పబ్జీ ఆడుకోవడాన్ని ఆయన గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీవో ఎం.శ్రీను కుమార్‌ను కలిసి విషయాన్ని అయనకు చెప్పి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శాఖాపరమైన చర్యలకు డీవైఈవోను నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు పీవో తెలిపారు. డీవైఈవో కార్యాల యంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న సాయిశ్రీకిరణ్ 2018లో కారుణ్య నియామకంలో ఐటీడీఏ విద్యాశాఖలో ఉద్యోగిగా చేరాడు.

సీఆర్‌డీఏ అధికారికి బంగారు నంది అవార్డు



ఏలూరు రూరల్, జూలై 29: దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన సీఆర్‌డీఏ డివిజనల్ సర్వే అధికారి సొంగా రవీంద్రప్రసాద్‌కు సోమవారం హైదరాబాద్‌లో జాతీయ బంగారు నంది అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త శైవజ్ఞశర్మ, గోసంరక్షణ సమితి చైర్మన్ ఆకుల విద్యాసాగర్ గురూజీ, డాక్టర్ ఎస్.వి.ఆర్ వెంకటేష్ గురూజీ చేతులమీదుగా బంగారు నందిని, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. రక్తదాన సేవ, భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని ప్రాంతాలకు అతీతంగా రక్తదానం సరఫరాలో రవీంద్రప్రసాద్ చేస్తున్న సేవలను వారు కొనియాడారు. రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ అవార్డు విస్తృతమైన సేవలు అందించేందుకు బాధ్యతను పెంచాయని, 30 వేల మందికి రక్తదానం చేయించి, ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు.

ఓఎన్‌జీసీ అన్వేషణ

చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం విస్తృతంగా సర్వే
యలమంచిలి, పెనుగొండ,పెనుమంత్ర, కాళ్ళ మండలాల్లో తవ్వకాలు
ఇప్పటికే పలుచోట్ల గ్యాస్ నిక్షేపాలు గుర్తింపు

నరసాపురం, జూలై 29: జిల్లాలో చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ విస్తృత సర్వే చేపట్టింది. ఇప్పటికే పెనుగొండ, పెనుమంత్ర మండలాల్లో రెండు చోట్ల గ్యాస్ నిక్షేపాలను గుర్తించింది. కాళ్ళ, భీమవరం రూరల్ మండలాల్లో కూడా నిక్షేపాల కోసం లోతైన అన్వేషణ చేస్తున్నది. తాజాగా నరసాపురం మండలం సీతారాంపురం గ్రామాల్లో గుర్తించిన గ్యాస్ నిక్షేపాలను తరలించేందుకు పైప్‌లైన్ పనుల్ని కూడా పూర్తి చేసింది. జుత్తిగలో గుర్తించిన గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా గెయిల్ సంస్థకు అందిస్తుంది. రానున్న రోజుల్లో యలమంచిలి, ఆచంట మండలాల్లో కూడా విస్తృత సర్వేలు చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది.

నరసాపురంలో క్యాంప్

ఓఎన్‌జీసీ తొలిసారిగా 1977లో నరసాపురం మండలంలో గ్యాస్ నిక్షేపాలను గుర్తించింది. ఎల్‌బీచర్ల గ్రామంలో చేపట్టిన తవ్వకాల్లో భారీగా గ్యాస్ నిల్వలు వెలుగుచూశాయి. సముద్ర పరివాహక ప్రాంతంలో అపార నిల్వలు ఉన్నాయని సర్వేలో తేలడంతో ఓఎన్‌జీసీ నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకుంది. టెంపుల్ ల్యాండ్‌తో పేరుతో ఏర్పాటైన ఈ క్యాంప్ నుంచి కృష్ణా, గోదావరి జిల్లాల్లో చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం గడిచిన 40 ఏళ్ల నుంచి పలు చోట్ల తవ్వకాలు జరిపి గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను వెలికితీసింది. కేజీ బేసిన్ పేరుతో పిలిచే ఈ ప్రాజెక్టు ఓఎన్‌జీసీ సంస్థకు ఎంతో లాభాలను చేకూర్చుపెట్టింది. ఈ మూడు జిల్లాల్లో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధిని కల్పించింది. ఏటా కోట్లాది రూపాయలతో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపడుతూ వస్తోంది.

మళ్లీ పశ్చిమపై దృష్టి

గడిచిన కొంతకాలంగా ఓఎన్‌జీసీ తూర్పు, కృష్ణా జిల్లాపైనే దృష్టి సారించింది. కృష్ణా జిల్ల బంటుమిల్లి, కృతివేణి మండలాల్లో పలుచోట్ల తవ్వకాలు జరిపి గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను గుర్తించింది. కోనసీమ జిల్లాలో కూడా భారీగా ఆయిల్ నిక్షేపాలను వెలికితీసింది. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, అచంట, పెనుగొండ, పెనుమంత్ర, కాళ్ళ, భీమవరం రూరల్ ప్రాంతాల్లో కూడా విస్తృత సర్వే చేసి పలు చోట్ల నిక్షేపాలను గుర్తించింది. పెనుమంత్ర మండలం జుత్తిగలో ఆయిల్ నిక్షేపాలను గుర్తించింది. ఇదే ప్రాంతానికి కొద్ది దూరంలో బ్రహ్మణచెరువు, నత్తారామేశ్వరం వద్ద కూడా రిగ్‌లు వేసి తవ్వకాలు మొదలుపెట్టింది. పెనుగొండ, కాళ్ళల్లో కూడా తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. భీమవరం మండలం లోసరిలో ఇప్పటికే తవ్వకాలు జరిపి గుర్తించిన బావికి సీల్ వేశారు. మరో మూడేళ్ల తరువాత ఇక్కడ నిక్షేపాలు పెరిగితే వాటిని వెలికితీసే యోచనలో ఉన్నారు. ఐదేళ్ల క్రితం నరసాపురం మండలం సీతారాంపురం ఇంజనీరింగ్ కాలేజీ వెనుక జరిపిన తవ్వకాల్లో గ్యాస్ నిక్షేపాలు వెలుగుచూశాయి. వీటిని పైప్‌లైన్ ద్వారా ఓఎన్‌జీసీ టెంపుల్ ల్యాండ్‌లోని రిగ్గుకు తరలించేందుకు పనులు ప్రారంభించారు. ఐదేళ్లవరకు ఈ బావిలో నిక్షేపాలు ఉంటాని ఓఎన్‌జీసీ అంచనా వేస్తుంది. తాజాగా యలమంచిలి, ఆచంట గోదావరి పరివాహక ప్రాంతంలో కూడా చేపట్టిన సర్వేలో గ్యాస్ నిక్షేపాలను గుర్తించారు. త్వరలో ఈ రెండు మండలాల్లో రిగ్గులు వేసేందుకు ఓఎన్‌జీసీ రెడీ అవుతుంది.



అత్యధికంగా గ్యాస్ నిక్షేపాలే

జిల్లాలో చమురు కన్నా గ్యాస్ నిక్షేపాలే లభ్యమవుతున్నాయి. గత మూడేళ్లలో జరిపిన తవ్వకాల్లో గ్యాస్ నిల్వలే బయటపడ్డాయి. జుత్తిగ, సీతారాంపురం బావిల్లో బయటపడ్డ గ్యాస్ నిక్షేపాల మాదిరిగానే పెనుగొండ, పెనుమంత్ర మండలాల్లో జరుపుతున్న తవ్వకాల్లో కూడా గ్యాస్ నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నరసాపురం మండలం నవరసపురం వద్ద ఓఎన్‌జీసీకి సంబంధించి గ్యాస్ స్టోరేజ్ పాయింట్ ఉంది. నరసాపురం, రుస్తుంబాద, చిట్టవరం బావుల నుంచి వస్తున్న గ్యాస్‌ను ఈ రిగ్గు ద్వారా గెయిల్ సంస్థ, విజ్జేశ్వరం, తణుకు ప్రాంతంలోని పలు కంపెనీలకు తరలిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ఓఎన్‌జీసీ చేపట్టిన అన్వేషణకు కొన్ని ప్రైవేట్ కంపెనీలను కూడా జత చేసుకుంది. అత్యంత అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యయాన్ని తగ్గించుకుని నిక్షేపాల కోసం లోతైన అన్వేషణ చేస్తున్నట్లు ఆ సంస్థకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు.

పంచాయతీ అవినీతిపై కొరడా

ద్వారకాతిరుమల సర్పంచ్, కార్యదర్శి, పూర్వపు ఎంపీడీవోలపై చర్యలకు డీపీవో సిఫార్సు



ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయం

ద్వారకాతిరుమల, జూలై 29: ద్వారకాతిరుమల మేజర్ పంచాయతీలో 2 కోట్ల రూపాయలు పైబడి జరిగిన అవినీతిపై అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీలో ఆర్థికపరమైన లావాదేవీలు తక్షణం నిలుపుదల చేయాలని డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ మండల అధికారులకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావును విధుల నుంచి తొలగించాలని పంచాయతీ రాజ్ కమిషనర్‌కు సిపార్సు చేసినట్టు తెలిపారు. గతంలో ఇక్కడ ఎంపీడీవో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసి, ప్రసుతం ఎన్‌టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో పనిచేస్తున్న ఆశీర్వాదం రూ.18,73,538 నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ఆయనపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేశామన్నారు. రూ.53,57,376 నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ కుంటం స్వర్ణలతకు, రూ.1,30,85,013లకు సంబంధించిన నగదు రికవరీ కోసం కార్యదర్శికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. చెక్‌పవర్ రద్దుకు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. త్వరలో శాశ్వత పదవి రద్దు కోసం 249 (బి)(1) ప్రకారం చర్యలుంటాయన్నారు.

గుట్టు రట్టయిందిలా..

పంచాయతీలో అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు విచారణాధికారిగా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో రజావుల్లా ఫిబ్రవరి 17న విచారణ చేపట్టారు. పంచాయితీ కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఖర్చులు, జమలు , వసూళ్ల రికార్డులను చూసి ఫిర్యాదుదారు అముక్త, పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఈవోపీఆర్డీ సుబ్బరాయన్ తదితరుల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. విచారణాధికారి తన నివేదికను ఏప్రిల్ 26న జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. తర్వాత కార్యాలయాల చుట్టూ నివేదిక కోసం తిరిగిన అముక్తకు సమాచార హక్కు చట్టం కింద దానిని అందజేయడంతో గుట్టు రట్టయింది.



వద్దిపర్రు రోడ్డుపై వరదనీటిలో ట్రాక్టర్ నడుపుతూ బాధితులను పరామర్శిస్తున్న మంత్రి రామానాయుడు

బాధితులను ఆదుకుంటాం : మంత్రి నిమ్మల

యలమంచిలి, జులై 29: జగన్ ఐదేళ్లపాలనలో దొడ్డిపట్ల గ్రామంలోని గోదావరిని ఆనుకుని ఏటిగట్టు నివాసితులకు చెందిన కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించకుండా అగ్నికుల క్షత్రియులకు, పేదలకు తీరని అన్యాయం చేశాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. దొడ్డిపట్లలో వరద ముంపునకు గురైన పల్లిపాలెం, వద్దిపర్రు గ్రామాల్లో మంత్రి పర్యటించి బాధితులను పరామర్శించారు. బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. రానున్న కాలంలో అన్ని మౌలిక వసతులతో మోడల్ కాలనీగా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఏటిగట్టు పటిష్టతకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికార యంత్రాం గానికి ఆదేశాలు ఇచ్చామని మంత్రి రామానాయుడు తెలిపారు. వద్దిపర్రులోని నాలుగు అడుగుల లోతున ఉన్న వరద నీటిలో ట్రాక్టర్ నడుపు కుంటూ వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రస్తుతం నారుమళ్లు, వరినాటు కుళ్లిపోయాయని వాటి వివరాలను సేకరించి న్యాయం చేస్తామన్నారు. పశువులకు దాణా ఇచ్చి ఆదుకుంటామన్నారు. వరద తగ్గుముఖం పట్టి యధాస్థితి వచ్చే వరకు ప్రభుత్వం సహాయక చర్యలు చేపడుతుందన్నారు. బాధిత కుటుంబాలకు 720 మందికి ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, ఆయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, నిత్యావసర సరుకులను మంత్రి అందించారు. ఇళ్లు మునిగిపోయిన 30 కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు రూ.3 వేలు నగదు అందజేశారు.

ముంపు ప్రాంతాల్లో డీఎంహెచ్‌వో పరిశీలన



పోడూరు మండలంలోని వద్దిపర్రు ముంపు ప్రాంతాల్లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లోని వరద బాధితులతో ఆయన మాట్లాడి వైద్యం, ఆరోగ్యంపై సూచనలు చేశారు. వరద తగ్గిన తర్వాత బ్లీచింగ్ క్లోరినేషన్ చేపట్టాలని దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వేణుబాబు, ఎంపీహెచ్‌ఈవో ఎం.శివకుమార్, సూపర్‌వైజర్ ఎం.మోహన్, బి.వెంకటేశ్వరావు ఆయన వెంట ఉన్నారు.

యువతలో నైపుణ్యాన్ని గుర్తించాలి : ఎంపీ మహేష్



ఏలూరు రూరల్, జూలై 29: యువతకు ఉపాధి, నైపుణ్యత పెంపుపై పార్లమెంట్‌లో మొదటిసారి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తన గళాన్ని వినిపించి ఆకట్టుకున్నారు. పార్లమెంట్ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో 85వ ప్రశ్నకు ఏలూరు ఎంపీ మాట్లాడుతూ యువతలో నైపుణ్యత పెంచి, ఉపాధి ప్రోత్సాహకాలను ప్రకటించిన ఆర్థికమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫల మైందన్నారు. నిరుద్యోగం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉందని యువత సామర్థ్యాన్ని గుర్తించేందుకు ఏపీలో స్కిల్ సెన్సస్ చేస్తున్నారని స్పష్టం చేశారు. దేశ జనాభాలో 5వ వంతుపైగా ఉన్న పట్టభద్రులు, యువతలో నైపుణ్యతను గుర్తించే చర్యలు కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదా? లేదా? అని కేంద్ర మంత్రి నుంచి తెలుసుకుంటున్నానని పేర్కొన్నారు. దీనికి సంబంధించి కేంద్ర కార్మిక, ఉపాధిశాఖా మంత్రి మన్‌షుక్ మాండివ్యా మాట్లాడుతూ యువతకు ఉపాధి కోసం నైపుణ్యం చాలా అవసరమని మంచి ప్రశ్న వేసిన ఎంపీ ఆయన అభినందించారు.

30 మంది టీచర్ల బదిలీలు రద్దు !

ఏలూరు అర్బన్, జూలై 29 : గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా చేపట్టిన టీచర్ల అక్రమ బదిలీలను రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉమ్మడి జిల్లాలో 30 మందిపై ప్రభావం చూపింది. కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా జరిపిన బదిలీల్లో ఒక్కో ఉపాధ్యాయుడి నుంచి రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు వసూళ్ళతో వైసీపీ ప్రభుత్వంలోని ఓ అమాత్యుడు ఆర్థికంగా లాభపడినట్టు ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎన్నికల ముందు వరకు జరిగిన ఉపాధ్యాయుల బదిలీలను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లలో మొత్తం 30 మందికి గత ప్రభుత్వం వ్యక్తిగతంగా జారీచేసిన బదిలీ ఉత్తర్వులన్నింటినీ రద్దు చేస్తూ ఆదేశాలు జిల్లాకు పంపారు. వాస్తవానికి గవర్నమెంట్ ర్యాటిఫికేషన్ లేకుండా జరిగిన ఈ అక్రమ బదిలీ ఉత్తర్వులు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జారీ అయినా, సంబంధిత టీచర్లు నూతన బదిలీ స్థానాల్లో విధుల్లో చేరడానికి మే ఒకటో తేదీగా నిర్ణయించడం, ఈలోగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో అడుగు ముందుకు పడలేదు. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పరాజయాన్ని చవి చూడటంతో టీచర్ల అక్రమ బదిలీలు కూటమి ప్రభుత్వ దృష్టికి వచ్చాయి. మరోవైపు అక్రమ బదిలీలను నిలుపుదల చేయాల్సిందిగా ఉపాధ్యాయ సంఘాల నుంచి కూడా డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలకు ముందు జరిగిన టీచర్ల హడావుడి బదిలీలన్నింటినీ రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా బదిలీ ఉత్తర్వుల రద్దుపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు సమాచారం.

సజావుగా డిపార్ట్‌మెంట్ పరీక్షలు

ఏలూరు రూరల్, జూలై 29: ఏలూరులోని సిద్దార్థ ఫెస్ట్ సీబీఎస్‌ఈ పాఠశాలలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రెండోరోజు సోమవారం సజావుగా జరిగాయని ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షల్లో 38 మందికి 31 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 65 మందికి 50 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఆర్డీవో తెలిపారు.

అనూహ్యం నాటకానికి 3 బహుమతులు

పాలకొల్లు, జూలై 29 :పాలకొల్లు నటీనట సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతిలో ప్రదర్శించిన అనూహ్యం నాటిక 3 బహుమతులు సాధించింది. జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో ఈ నాటికకు ఉత్తమ జ్యూరీ ప్రదర్శన, ఉత్తమ పాత్రోచిత నటిగా వసుంధర పాత్రధారిణి జ్యోతిరాణికి, ఉత్తమ రంగాలంకరణకు పి.శ్రీధర్‌కు అవార్డులు లభించినట్టు గుడాల హరిబాబు తెలిపారు. నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు అభినందించారు.

ఆదుకోండి..

లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సకు రూ.40 లక్షలు
తమ కుమార్తె ప్రాణం కాపాడాలంటూ అభ్యర్థన



చికిత్స పొందుతున్న విద్యార్థిని జ్ఞానేశ్వరి

ఏలూరు అర్బన్, జూలై 29 : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. సాయంకోసం దాతల సహాయాన్ని అర్థిస్తోంది. ఏలూరు కొత్తపేట ఐకేపీ భవన్-2 సచి వాల యంలో పనిచేస్తున్న ఏఎన్ఎం కోటం దుర్గ ఏకైక కుమార్తె జ్ఞానేశ్వరి (14)కి కామెర్లు ముదరడంతో లివర్‌మార్పిడి జరగాల్సి ఉందని వైద్య నిపుణులు నిర్ధారించారు. జ్ఞానేశ్వరి ప్రస్తుతం ఏలూరులోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. దుర్గ భర్త ఓ కేటరింగ్ సెంటర్‌లో దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామానికి చెందిన ఏఎన్ఎం దుర్గ ఏలూరులో విధులు నిర్వర్తిస్తున్నారు. జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత దుర్గకు లేదు. ప్రభుత్వ సాయం కోసం కూడా ప్రయత్నించింది. సమయం మించి పోతుండటంతో ఆర్థిక సాయం కోసం అందరినీ ఆశ్రయిస్తోంది. రెండు రోజుల్లోగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకపోతే ప్రాణానికే ప్రమాదమని విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యులు తేల్చిచెప్పారు. ఈ చికిత్స జరగాలంటే రూ.40 లక్షలు ఖర్చవుతుందని అంత స్తోమత లేక ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో సాయం కోరుతున్నారు. డీఎం హెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు కొందరు తమకు తోచినంత సాయం అందజేశారు. తన కుమార్తె చికిత్సకు సహకరించి ప్రాణం నిలపాలని ఏఎన్ఎం దుర్గ అర్థిస్తోంది. దాతలు తమ సాయాన్ని ఫోన్‌పే నెంబరు 96767 92602కు పంపి ఆదుకోవాలని కోరుతోంది.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 29 : జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ (అండర్-14,17) సెక్రటరీ పోస్టు భర్తీకి ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఫిజికల్ డైరెక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టు రెండేళ్ల కాలపరిమితికి మాత్రమే ఉంటుందన్నారు. మహిళా అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత పాఠశాల హెచ్ఎం సిఫారసుతో ఆగస్టు రెండో తేదీలోగా ఏలూరు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

దిగమర్రులో పిచ్చి కుక్క స్వైర విహారం

నలుగురిపై దాడి.. వృద్ధురాలి పరిస్థితి విషయం



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

పాలకొల్లు రూరల్, జూలై 29 : పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామంలో సోమవారం ఒక పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. వృద్ధురాలితో పాటు మరో ముగ్గురిపై దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. స్తానవరపు సీతమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడగా బండి రామకృష్ణ, రాపాక జాన్సన్, సుధాకరరావులకు గాయాలయ్యాయి. వీరిని పాలకొల్లు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సీతమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.పిచ్చికుక్కను గ్రామస్థులు హతమార్చారు. కుక్కలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫోన్‌లో పరిచయం..మోసపోయిన యువతి

జంగారెడ్డిగూడెం, జూలై 29 : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తిని నమ్మి తన ఇంటి నుంచి వెళ్లిన యువతిని మరో వ్యక్తి మాయ మాటలు చెప్పి ఒక గదిలో పెట్టి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతి బసు తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన యువతి (17) పదో తరగతి వరకూ చదివి ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో రిషి అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల క్రితం ఆమె జంగారెడ్డిగూడెం వచ్చింది. బస్టాండ్ నుంచి రిషికి ఫోన్ చేయగా అతను వచ్చి ఆమెను చూసి మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయాడు ఆమె బస్టాండ్ వద్ద ఉండగా బంటుమిల్లి శ్రీను అనే వ్యక్తి ఆమెను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. అక్కడ వేగవరం గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు ఆ యువతితో పరిచయం పెంచుకుని ఆమెను తన ఊరు పంపిస్తానని పట్టణంలో ఒక గదిలో ఉంచాడు. ఈనెల 26న గదిలో ఉన్న యువతిని కొట్టి అత్యాచారం చేశాడు. యువతి ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి

నరసాపురం రూరల్, జూలై 29: మండలంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సోమవారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని జాతీయ రహదారిపై అగి ఉన్న ఓఎన్‌జీసీ లారీని బైక్‌పై వెళ్లుతున్న వ్యక్తి ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు పెనుమంత్ర మండలం జుత్తిగ గ్రామానికి చెందిన వెంకటరెడ్డి (43)గా గుర్తించారు. రుస్తుంబాద గ్రామంలోని కోళ్ళఫారం నిర్వహణ చేసుకుంటూ నరసాపురంలో ఉంటున్నాడు. మృతుడిని ఏరియా అస్పత్రికి తరలించారు. మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామంలో ఆటోని బైక్ ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మోడీ గ్రామానికి చెందిన గుబ్బల భానుప్రకాష్ (25)గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూలై 29 : పట్టాలు దాటుతున్న వృద్ధుడిని వేగంగా వెళ్తున్న రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భీమడోలు రైల్వేస్టేషన్ వద్ద సుమారు 60 సంవత్సరాల వయసు కల్గిన వృద్ధుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ సైమన్‌కు సిబ్బందితో వెళ్ళి పరిశీలించారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు ,తెల్లని జుత్తు, తెల్లని గడ్డంతో ఉన్నాడు. కుంకుమ రంగు పొట్టి చేతుల చొక్కాతో ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసినవారు రైల్వే ఎస్ఐ నంబర్ 99892 19559కు సమాచారం అందించాలని కోరారు.

పాలకొల్లులో పట్ట పగలే దారుణం

వృద్ధురాలిని గాయపరిచి, నగలు చోరీ




చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం, డీఎస్పీ శ్రీనివాసరావు.. దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న అనసూయ

పాలకొల్లు అర్బన్, జూలై 29 : పాలకొల్లు పట్టణంలో సోమవారం జరిగిన సంఘటన సంచలనం రేపింది. పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. 6వ వార్డు బోండాడ వారి వీధిలో నివసిస్తున్న కలిశెట్టి అనసూయ అనే వృద్ధురాలిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి ఆమె ఒంటిపై ఉన్న బంగారు వస్తువులను దొంగిలించుకు పోయారు. అనసూయ భర్త శ్రీనివాసరావు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యారు. ఆయన మరణించడంతో పట్టణంలో కూతురు ఇంటి కింద భాగంలో ఉంటోంది. అనసూయ ఒంటరిగా ఉన్న సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి రాయితో తీవ్రంగా గాయపరిచారు. ఆమె మెడలోని బంగారు గొలుసు, చెవి దుద్దులు, నాలుగు బంగారు గాజులు దొంగిలించుకుపోయారు.భవనం పైఅంతస్తులో ఉంటున్న ఆమె కుమార్తె కింద జరిగిన సంఘటన గమనించి కేకలు వేయడంతో దండగులు పారిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన అనసూయను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రికి తరలించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీమ్‌తో సహా చేరుకున్న ఎస్పీ అద్నాన్ నయీం బాధిత కుటుంబంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. పట్టణంలోని మావుళ్ళమ్మపేటకు చెందిన ఒకయువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి అమలాపురానికి చెందిన వాడిగా తెలిసింది.

ఏటీఎం కార్డు మార్చి.. సొమ్ము కాజేశారు

జంగారెడ్డిగూడెం, జూలై 29 : ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లిన ఒక వృద్ధుడి ఏటీఎం కార్డును మార్చి అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.31,500 కొట్టేశారు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బుట్టాయ గూడెం మండలం మర్లగూడెం గ్రామానికి చెందిన పరిటాల లక్ష్మీనారాయణ జంగారెడ్డిగూడెం పట్టణంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉన్నాడు. ఈనెల 27వ తేదీన ఏలూరు రోడ్డులో ఉన్న ఒక ప్రైవేటు బ్యాంకు ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేయడానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న యువతీ, యువకులు వృద్ధుడి ఏటీఎం ద్వారా రూ.3500 నగదు విత్‌డ్రా చేసి ఇచ్చారు.ఆ సమయంలోనే ఆయన ఏటీఎం కార్డు ఇవ్వకుండా వేరే కార్డు ఇవ్వడంతో గమనించని వృద్ధుడు అక్కడి నుంచి వెళ్లి పోయాడు. సోమవారం తన పాస్ పుస్తకంలో పోస్టింగ్ వేయించుకునేందుకు వచ్చిన తర్వాత ఆయన అకౌంట్ నుంచి దఫ దఫాలుగా రూ.31500 కట్ అయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సూర్య ఘర్ యోజనతో సోలార్ విద్యుత్ : కలెక్టర్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, జూలై 29: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్, కరపత్రికలను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియోగాన్ని పోత్రహిస్తుందన్నారు. మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటుకు రూ.78వేల వరకు కేంద్రం సబ్సిడీ ఇస్తుందన్నారు. సబ్సిడీ గృహవినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని, బ్యాంకులు కూడా రుణం ఇస్తాయన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు మాట్లాడుతూ రూట్‌టాప్ ద్వారా విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో ఎం.ముక్కంటి, ఆర్డీవో ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేసిన రైతులు


బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న రైతు నేతలు

ఉంగుటూరు, జూలై 29: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక బడ్జెట్ ప్రవేశ పెట్టిందని సంయుక్త కిసాన్ సంఘ్ నిరసన వ్యక్తం చేసింది. కైకరంలో జిల్లా రైతు సంఘం, కౌలు రైతు సంఘం ప్రతినిధులు కె.శ్రీనివాస్, కొర్ని అప్పారావు బడ్జెట్ పత్రాలను సోమవారం దహనం చేశారు. తూర్పు వీధిలో జరిగిన నిరసనలో భాగంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చిత్తా వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు

రైతు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

ఏలూరు రూరల్, జూలై 29: జిల్లాలో రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ వెట్రిసెల్వికి రైతులు, కౌలురైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. తొలుత కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, తట్టా సుబ్బారావు, అప్పారావు పాల్గొన్నారు.

పంట బోదెల్లో పూడిక తొలగింపు చేపట్టాలి

పోలవరం, జూలై 29 : మండలంలో కొత్తపట్టిసీమ రైతులకు సాగు నీరందించే మంగపతిబోదె, చెల్లయమ్మ బోదెల్లో పూడిక తొలగింపు పనులు చేయించాలని రైతులు సోమవారం కోరారు. మంగపతిబోదె, చెల్లాయమ్మ బోదెలలో పడిన ఇసుక మేటలను పరిశీలించిన జనసేన నేత గునపర్తి చిన్నికి సమస్యలు వివరించారు. ఇటీవల మంగలిగడ్డ వాగు దాటికి బోదెలలో ఇసుక మేటతో నీరు రావడం లేదన్నారు. అధికారులు స్పందించి యంత్రాలతో పూడిక తొలగించాలని కోరారు.

పార్వతీశ్వర శర్మకు దైవజ్ఞ భాస్కర బిరుదు


శర్మను సత్కరిస్తున్న పండితులు

భీమడోలు, జూలై 29: పోలసానపల్లి గ్రామానికి చెందిన హంపి పీఠ ఆస్థాన సిద్ధాంతి కాశీభొట్ల పార్వతీశ్వరశర్మకు దైవజ్ఞ భాస్కర బిరుదు దక్కింది. కడప జిల్లా వెండి వీరాంజనేయ క్షేత్రంలో అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం తరపున జరుగుతున్న అఖిల భారత పంచాంకర్తల సభలో పార్వతీశ్వరశర్మ పాల్గొన్నారు. ఆయనకు బ్రాహ్మణ సంఘం దైవజ్ఞ భాస్కర బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. ఈ సభలో రానున్న విస్వావసు నామ సంవత్సర పండుగలకు సంబంధించిన పర్వదినాలను వివరించారు. బిరుదాంకితులు శర్మను భీమడోలు మండలంలోని పలువురు అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో రావికంపాడు విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన రావికంపాడు విద్యార్థులు

కామవరపుకోట, జూలై 29: రావికంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'స్మార్ట్ ఇండియా- యువత పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచారు. టాటా కంపెనీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వైష్ణవి, సాయిలక్ష్మి బంగారు పతకాలు సాధించారు. సౌమ్య, సాత్విక రజత, సాయి వినయ్, మీనాక్షి కాంస్య పతకాలు పొందారు. హెచ్ఎం భీమరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని నైపుణ్యం బయటకు వస్తుందన్నారు. టాటా సంస్థ ప్రతినిధులు సందీప్, రామాంజనేయులు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు రాములు, దేవప్రియ, సత్యనారాయణ, ప్రసాద్, సతీష్‌కుమార్, పల్లాలు, మురళి, విజయకుమారి, సుజాత, చైతన్య, జయశ్రీ, రాజశ్రీ హాజరయ్యారు.

సీఆర్‌ఆర్‌లో ముళ్ళపూడి, టాటా జయంతి



మాట్లాడుతున్న అంబికా కృష్ణ

ఏలూరు అర్బన్, జూలై 29: పారిశ్రామికవేత్తలు ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్, జే.ఆర్.డి.టాటా జయంతి కార్యక్రమాలు సీఆర్‌ఆర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ముళ్ళపూడి, టాటాల పాత్ర కీలక భూమిక పోషించారన్నారు. ప్రతీ పారిశ్రామికవేత్త వారిని ఆదర్శంగా తీసుకుంటే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. కొడాలి సుబ్బారావు, కానాల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, యలమర్తి బాబు, రాజేష్, శ్యామ్‌ప్రసాద్, హేమంత్, రాము ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆరా

గ్రామసభల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్
ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాఠశాల తనిఖీ
తమ్మిలేరు నీరు విడుదల చేసిన రోషన్‌కుమార్


గ్రామసభలో సమస్యలు అడుగుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


తరగతి గదిలో పాఠాలు వింటున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


తమ్మిలేరు నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదు

దెందులూరు, జూలై 29: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రూపులు కట్టి పార్టీని ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని తిమ్మనగూడెం, రామారావుగూడెం, మేదినరావుపాలెంలో సోమవారం మీకోసం మీ చింతమనేని పేరిట నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. సమస్యలపై వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమాల్లో మోహన్‌రావు, నాగనబోయిన సత్యనారాయణ, రాము గౌడ్, మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, డాక్టర్ పసుమర్తి మధుబాబు, బాదంపూడి రమేష్, తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

బుట్టాయగూడెం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విద్యాశాఖాధికారులు, హెచ్ఎంలను, ఉపాధ్యాయులను ఆదేశించారు. రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో కలసి ఇంగ్లీషు పాఠాలను విన్నారు. విద్యార్థులు పాఠాలు చదవడం, ఆంగ్లంపై పట్టు పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతిగృహాల్లోని సదుపాయాలు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, భోజనశాల ఆటస్థలం పరిశీలించి పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆటస్థలం, పాఠశాల పరిసరాలను బాగుచేయడానికి జేసీబీని పంపిస్తానని శుభ్రం చేయాలని హెచ్ఎంకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం హసవతు వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

తమ్మిలేరు ఎడమ కాల్వకు నీరు విడుదల

చింతలపూడి: తమ్మిలేరు రిజర్వాయర్ ఎడమ కాల్వ నుంచి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ నీరు విడుదల చేశారు. యర్రంపల్లి, యడవల్లి, కల్యాణం పాడు, లింగపాలెం, సీసీఆర్‌పాలెంలోని భూములకు సాగు నీరు అందుతుందన్నారు. అంతకు ముందు రిజర్వాయర్‌లో పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయ కొట్టి పూజలు జరిపారు. అనంతరం రైతుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ప్రాంతం కుడి, ఎడమ, మధ్య కాల్వల పరిధిలో మొత్తం 9 వేల ఎకరాలు సాగులో ఉందన్నారు. నీటిపారుదల శాఖ డిఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కాల్వల మర్మతుల కోసం జైకా నిధులు రూ.13 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించామన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జున్‌రావు, కె.రాజారెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, కొత్తపూడి శేషగిరిరావు, టి.ఎస్.వి కుమార్, మధుబాబు, పరమానందం, రైతులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు తెలుగుదేశం పార్టీ ఆశయం

లింగపాలెం: రైతు శ్రేయస్సు తెలుగుదేశం పార్టీ ఆశయమని, సీఎం చంద్రబాబు రైతు వెన్నంటి ఉంటారని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజిగూడెంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ సహకారంతో పూడిక తీయించిన పాలవాగు ఛానెల్‌ను ఆయన పరిశీలించారు. చెరువులకు నీరు రాకుండా గుర్రపుడెక్క, చెత్తతో పాలవాగు ఛానెల్ పూడిపోయింది. నీటి సంఘం అధ్యక్షుడు మోరంపూడి ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 10కిలో మీటర్ల మేర పూడిక తీయించారు. రైతులకు సాగునీరుతో పాటు ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యమని, కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందన్నారు. ఆయనతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఆర్డీవో అద్దయ్యకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

దళితులపై దాడికి నిరసన

• నిందితులపై చర్యలు తీసుకోవాలి • కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆందోళన • స్వల్ప ఉద్రిక్తత

ఏలూరు రూరల్, జూలై 29: అగ్రవర్ణ భూస్వాములు ఇటీవల పెదవేగి మండలం తవ్వకుంట దళితులపై దాడులకు తెగబడ్డారని, కులంపేరుతో దూషించి, చంపేందుకు ప్రయత్నించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు బారికేడ్లు తొలగించే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కాశీకృష్ణ తదితరులు మాట్లాడారు. ఇటీవల ఎన్నికల్లో ఒక పార్టీకి ఓటు వేశారని, అది మనసులో పెట్టుకుని ఈనెల 18న దూషించి దాడి చేశారని, ఒకరిని చితకబాది కాళ్లు విరగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, దళితులకు ఎస్సీఎస్టీ చట్టం ద్వారా రావాల్సిన రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణకుమారి, ఎం.సుమన్, శ్రీను, కె.రెడ్డియ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించిన వరద బాధితులు

వేలేరుపాడు: గోదావరి వరదతో 15 రోజులుగా మండలంలో జనజీవనం స్తంభించిపోయిందని, నానా అవస్థలు పడుతున్న తమకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేలు పరిహారాన్ని అందించాలని సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తిరుమలాపురం, నాళ్ళవరం, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, కటుకూరు, కోయిద, రుద్రమ్మకోట, మేడేపల్లి, రామవరం, తదితర గ్రామాల నుంచి సుమారు 400 మంది తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అందరికీ రూ.3వేలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు ఇళ్లలోకి వరద వచ్చిన వారికి మాత్రమే పరిహారం ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని, పరిహారం ఇవ్వడంలో కొర్రీలు అన్యాయమని బాధితులు ఆక్రోశించారు. అఖిలపక్షం నాయకులు ఎస్‌కే.గౌస్, బాడిత రాము, గరుముల రమేష్, తదితరులు మాట్లాడారు. ప్రతీ కుటుంబానికి పరిహారాన్ని చెల్లించాలని, నెలరోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. నాయకులు వీరాస్వామి, ముత్యాలరావు, నాళ్ళవరం సర్పంచ్ కే.రంగమ్మ, ఎంపీటీసీ ఎం.రత్తమ్మ, తిరుమలాపురం సర్పంచ్ ఎస్.విజయ, కారం దారయ్య, రామవరం సర్పంచ్ ప్రసాద్, దుర్గారావు, కుంజా అప్పారావు, ఎస్‌కే.మురళీ, తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, జూలై 29: డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నికలు సోమవారం జరిగాయి. డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కమిటీ వివరాలు తెలియజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా తలపంటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.చంద్రశేఖర అజాద్ ఎన్నికయ్యారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గం టీచర్ల సమస్యలను పరిష్కరించే సత్తా పెంపొందించుకోవాలని, సమన్వయంతో సంఘ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కార్యవర్గానికి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మరడాని అచ్యుతరావు, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

11న రాజ్యాంగ వార్షికోత్సవ పోటీలు

ఏలూరు కార్పొరేషన్, జూలై 29: కస్తూరిబా హైస్కూలు ప్రాంగణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం, 75వ రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భాలను పురస్కరించుకుని 11న విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు మహిళా సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. భారత రాజ్యాంగం పీఠికలోని అంశాల ఆధారంగా ఎంపిక చేసిన చిత్రాల డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష

పెదపాడు, జూలై 29: పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందిని ఎంపీడీవో తేజరతన్ ఆదేశించారు. పెన్షన్ల పంపిణీపై సోమవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్లోబల్ టైగర్ డే అవగాహన కార్యక్రమం

పోలవరం, జూలై 29: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్లోబల్ టైగర్ డే నిర్వహించారు. జీవ వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల ప్రాధాన్యత తదితర అంశాలపై విద్యార్థులకు అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ వైల్డ్ లైఫ్ డీఆర్వో ప్రభాకర్, వాడపల్లి డీఆర్వో సూరిబాబు, సెక్షన్ ఆఫీసర్ ఈశ్వరరావు, టేకూరు సెక్షన్ ఆఫీసర్ బాబూరావు, సిబ్బంది, హెచ్ఎం లక్ష్మీకాంతం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

టి.నరసాపురం, జూలై 29: రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ పి.లలిత సుధ తెలిపారు. బొర్రంపాలెం రైతుసేవా కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వరి పంటను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు యాజమాన్యం పాటించాలన్నారు. ఊడ్పుల సమయంలో వరి ఆకుల చివర కత్తిరించి నాటాలన్నారు. సూచించిన మేరకు ఎరువులు వాడాలన్నారు.

కలుపు నివారణ చేపట్టాలి

చింతలపూడి, జూలై 29: వరి సాగులో కలుపు నివారణ ప్రధానమని అందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కె.మీనాకుమారి అన్నారు. ప్రగడవరంలో జరిగిన రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ రైతులు భూసారపరీక్షలు ఫలితాల మేరకు ఎరువులు వినియోగించుకోవాలన్నారు. నాట్లువేసిన వెంటనే తుంగ, గరికి కలుపుమొక్కల నివారణ చేపట్టాలన్నారు.



భీమడోలు మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే ధర్మరాజు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, జూలై 29: మండలంలో ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశంలో సోమవారం ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మండలంలో ప్రధాన సమస్యలపై చర్చించి సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. మైక్రో ఫిల్టర్లను మరమ్మతు చేయించి లంక గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో డ్రైనేజీలు, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వర్ణలత, జడ్పీటీసీ భవానీ, ఎంపీపీ ఆదాము, ప్రత్తిమదన్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

వేలేరుపాడు, జూలై 29: చెల్లావారిగూడెం, స్వర్ణవారిగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితులు సోమవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలసి వినతిపత్రం ఇచ్చారు. శ్రీరామపురం, కటుకూరు, జగన్నాధపురం, చిగురుమామిడి, నాళ్ళవరం, తాటుకూరుగొమ్ము, రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన సుమారు 300 కుటుంబాలు రెండేళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు లేవని, పిల్లలకు చదువు కూడా లేదన్నారు. ప్రస్తుతం వరదల కారణంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

జంగారెడ్డిగూడెం, జూలై 29: పట్టణంలోని ఎల్ఐసీ పాత భవనం సమీపంలో మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు. సోమవారం సాయంత్రం పసుపులేటి మమత, మరో ఇద్దరు మహిళలు వాకింగ్‌కు వెళుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తి మమత మెడలో బంగారు పుస్తెల తాడును ద్విచక్ర వాహనంపై వచ్చి లాక్కెళ్లిపోయాడు. మహిళ తీవ్ర ఆందోళనకు గురైంది. స్థానికుల ఫిర్యాదుతో సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబసు వివరాలు సేకరించారు.

వీధిలైటు స్తంభంపై అకస్మాత్తుగా మంటలు

ఏలూరు క్రైం, జూలై 29: కొత్త బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వీధిలైటు స్తంభంపై అకస్మాత్తుగా వివిధ కేబుల్ వైర్లు నుంచి మంటలు వచ్చాయి. సమాచారం అందుకున్న ఏలూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ వైర్లకు కేబుల్ వైర్లు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు సంభవించినట్లు చెబుతున్నారు. రాత్రి వేళ అక్కడ వేరే కేబుల్స్‌ను మరమ్మతులు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వైర్లను బిగిస్తుండగా ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** రాష్ట్రంలో మద్యపానం, మత్తు పదార్థాలను నిషేధించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, యామినిలు ఉన్నారు.
- **ఏలూరు రూరల్ :** రివర్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో యానాదుల కాలనీకి చెందిన నర్సింగ్ విద్యార్థిని సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ పాతూరి సుధాకర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.
- వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మూడో డివిజన్ ఇన్‌చార్జి జాలా బాలాజి తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ఉదయం ర్యాలీ నిర్వహించారు. ఎంహెచ్‌వో మాలతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, రంగారావు, ధనుష్, వెంకటరమణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.
- స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మలేరియా విభాగంతో కలిసి మారుతీనగర్, నవాబుపేట కాలనీ, జాలిపూడి ట్రెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగుకాలువల కల్వర్టు క్రింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో నిల్వనీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు.
- **ఏలూరు క్రైం :** ఫైర్‌స్టేషన్ బస్టాప్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. కొద్ది రోజుల నుంచి భిక్షాటన చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించి మున్సిపాల్టీకి అప్పగించారు.
- **పెదవేగి :** ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. రాజుపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- తెలంగాణకు చెందిన పలువురు భక్తులు రాట్నాలమ్మకు బోనాల మొక్కులు చెల్లించారు. ఖమ్మం జిల్లాకు చెందిన భక్తులు అమ్మవార్ల వేషధారణలో అమ్మవారిని దర్శించుకుని, బోనాలు సమర్పించారు.
- **భీమడోలు :** పోలసానపల్లి రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అందజేశారు. సర్పంచ్ షేక్ హసీనా రహీమాబేగమ్, ప్రత్తి మదన్, శ్రీనివాసరావు, నాయకులు, పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 31న జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ అర్హతలున్న వారు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 8886882032 నెంబరులో సంప్రదించాలని సూచించారు.
- జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇసుక కష్టాలు తీర్చాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో తాపీ పనివారల సంక్షేమ సంఘం, ట్రాక్టర్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్, ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘాలు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.
- **ద్వారకాతిరుమల :** కొండపై కల్యాణ మండపంలో గుర్తుతెలియని యాచకుడి మృతదేహాన్ని సెక్యూరిటీ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొండపై యాచన చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడు రెండురోజుల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడని పోలీసులు గుర్తించారు. అనాథశవంగా గుర్తించి ఖననం చేయించారు.


విద్యార్థులతో భోజనం చేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే చంటి


పోలవరం పాఠశాలలో భోజనం పంపిణీ


లక్కవరం హైస్కూల్‌లో భోజనం ఏర్పాటుచేసిన నేతలు


భోజనం చేస్తున్న కైకరం హైస్కూల్ విద్యార్థినులు

పాఠశాలల్లో శుభ దిన్

ఉత్సాహంగా ముందుకొచ్చిన దాతలు
విద్యార్థులకు విందు భోజనం

పెదపాడు, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నేత గుత్తా అనిల్ అన్నారు. పెదపాడు హైస్కూల్‌లో నిర్వహించిన శిక్షా సప్తాహ్, శుభదిన్ కార్యక్రమాల్లో విద్యార్థులకు భోజనం వడ్డించి, వారితో కలసి భోజనం చేశారు. అనిల్ మాట్లాడుతూ పాఠశాలల్లో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. వసంతవాడ హైస్కూల్‌లో హెచ్ఎం కె.శ్రీరామకుమార్ ఆధ్వర్యంలో శుభదిన్ నిర్వహించి భోజనాలు పెట్టారు.

● ఉంగుటూరు: మండలంలోని కైకరం హైస్కూలు, గొల్లగూడెం నెం.2 పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సలగాల గోపి, యాళ్ల సుజీవరావు, వేములపల్లి సుధీర్, సర్పంచ్ కరపా వెంకట శ్రీనివాసరావు, హెచ్ఎంలు గుళ్ల ప్రసాదరావు, ఆకివీడు వాణి, ఉపాధ్యాయులు కె.భువనేశ్వరి, స్వర్ణలత, కొల్లి నాగ పరమేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మండలంలోని అప్పలరాజుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, బొర్రంపాలెంలో మాజీ ఎంపీపీ కొత్త సురేఖ సహాయంతో విద్యార్థులకు భోజనం (పౌష్టికాహారం) అందించారు. పాఠశాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం శిక్షా సప్తాహ్ కార్యక్రమం చేపట్టిందని హెచ్ఎం పసుపులేటి బుచ్చిరాజు, కె.గంగరాజు తెలిపారు. మెతుకుమల్లి నాగేంద్ర, కాటేపల్లి సత్యనారాయణ, టి. దుర్గారావు, వెంకటకృష్ణారావు, ఉపాధ్యాయులు కృష్ణారావు, సుబ్బారావు, షర్మిలాబేగం, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజిగూడెం పాఠశాలల్లో ఆయన శిక్షాసప్తాహ్ శుభదిన్ భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. దాతల సహాయంతో విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందించారు. ఎంఈవోలు రామారావు, రవీంద్ర, ఉపాధ్యాయులు, గారపాటి బుజ్జియ్య, గుత్తా సత్యసాయివరప్రసాద్, గరిమెళ్ళ చలపతిరావు, పాతూరి శ్రీను, మోరంపూడి ప్రసాద్, కొత్తూరి నాగమణి, వెంకటేశ్వరరావు, రామ్మోహన్‌రావు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● నిడమర్రు: మండలంలో 35 ప్రాథమిక పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలల్లో పాలు, పెరుగు, పళ్ళు, స్వీట్లతో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. పెదనిండ్రకొలనులో సుమారు 330 మంది విద్యార్థులకు గ్రామపెద్దలు పత్సాకుల వాసు, ఫత్తేపురం ఉన్నత పాఠశాలలో ఉప సర్పంచ్ రుద్రరాజు వేంకటేశ్వరరాజు భోజనం సమకూర్చారు. హెచ్ఎం టీవీ.సత్యనారయణ, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, జాకబ్‌రాజు, రుద్రరాజు శిశ, పత్సమట్ల లచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీడీపీ నేతలు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు ఘంటా సుధీర్‌బాబు, ఘంటా సత్యంబాబు, నెక్కలపు సూర్యనారాయణ, ఎంఈవో డి.సుబ్బారావు, సీహెచ్.ప్రశాంతకుమార్, హెచ్ఎం గసబాబు పాల్గొన్నారు. రామన్నపాలెంలో విద్యార్థులకు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు ఆధ్వర్యంలో భోజనాన్ని ఏర్పాటు చేశారు. వడ్లమూడి సత్యనారాయణ, జాలపత్తి రాంబాబు, బేతిన వెంకన్నబాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, తెలగంశెట్టిరాము, చీకట్ల సాయి, బండి బాబి, కొణతాల సురేష్, ఉడతా గణేష్, దేవిశెట్టి అశోక్, చెంచాని ప్రసాద్, హెచ్ఎం లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో విద్యార్థులకు తొమ్మిది ఐటెమ్స్‌తో భోజనం ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం కెఎస్‌వి.లోవకుమారి తెలిపారు. దాతలు సిటీకేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్, డాక్టర్ కోట సునీత, డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు, కె.రామకృష్ణ, పి.సత్యనారాయణ, ఉక్కుర్తి సీతారామ్, ఉపాధ్యాయులు ఎం.విజయప్రకాష్, రవికుమార్, మధుసూదనరావు, కె.రమేష్, టి.జగదీష్, చిరంజీవిరావు పాల్గొన్నారు.

లక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎ.పోలవరం, సీతానగరం పాఠశాలల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నాదెండ్ల కృష్ణ, పెనుమర్తి రామకుమార్, కన్నా శ్రీదేవి, సత్తిబాబు, రాంబాబు, జివి.శ్రీనివాస్, పి.కృష్ణ, వెంకటస్వామి, సుబ్బారావు, మధు, బార్గవరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పాఠశాల హెచ్ఎం ప్రకాష్, లంకపల్లి మాణిక్యాలరావు, చేకూరి గణేష్, వాసా అన్నవరం, పాకాసి శ్రీను, సాంబయ్య, రాజ్‌కుమార్, సులేమాన్, ఉపాధ్యాయులు, పీడీ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలోని సూరప్పగూడెం పాతూరు ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం నిర్మల కుమారి అధ్యక్షతన సర్పంచ్ బాలాజీ విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. దాతలు షేక్ షీమ మిఠాయిలను అందజేశారు. గుండుగొలను, పోలసానపల్లి తదితర గ్రామాల్లో ఎంఈవో భాస్కర్ కుమార్ పాల్గొన్నారు. గుండుగొలనులో దాత బంటు విజయ్‌కుమార్ ఆర్థిక సాయంతో అరటి పండ్లు, ఫ్రూట్స్ విద్యార్థులకు అందజేశారు.

కోలాహలంగా శుభ్ దిన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారంతో విందు భోజనాలు .. పౌష్టికాహారం


ముసునూరులో విద్యార్థులకు టీడీపీ నాయకురాలు మధులత వడ్డన


వేమవరప్పాడు ఎంపీపీ పాఠశాలలో వడ్డిస్తున్న దాత అడవి ప్రసాద్


జంగంగూడెం, గొల్లపల్లి పాఠశాలల్లో వడ్డన


పోలవరం స్కూల్‌లో విద్యార్థులకు భోజనాల వడ్డన

ముసునూరు, జూలై 29: శిక్షా సప్తాహ్‌లో భాగంగా పాఠశాలల్లో శుభ్‌దిన్ తిథి నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకురాలు తుమ్మల మధులత సహకారంతో ముసునూరు జడ్పీ పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు అరటి పండ్లు, పెరుగన్నం, కేసరి, చాక్లెట్లను మధ్యాహ్న భోజనంతో పాటు అందజేశారు. ఎంఈవో బీవీ సుబ్బారావు పాల్గొన్నారు. లోపూడిలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో 100 విద్యార్థులకు అరటిపండ్లు, స్వీట్లను టీడీపీ నాయకులు చలమాల మల్లేశ్వరరావు, లక్కపాము కాంతారావు అందజేశారు. అలాగే కాట్రేనిపాడు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులే దాతలుగా మెనూకి అదనంగా పెరుగు, అరటిపండ్లను విద్యార్థులకు అందజేశారు.

చాట్రాయి: చాట్రాయి హైస్కూల్‌లో తెలుగు టీచర్ మోహనరావు, పోలవరం కోనేరు రంగారావు కాలనీ పాఠశాలలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, మర్లపాలెం హైస్కూల్‌లో వందనపు సురేష్, వాళ్ళ రవి, దద్దనాల ఉమామహేశ్వరరావు ఆర్థిక సహకారంతో భోజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాలల ఆవరణలలో మొక్కలు నాటారు. తహసీల్దార్ ముక్సూద్ అలీ, ఎంపీడీవో మంగాకుమారి, ఎంఈవో బ్రహ్మాచారి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: జంగంగూడెం ఎంపీపీ పాఠశాలలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వల్లభనేని భాస్కర్, టీడీపీ అధ్యక్షుడు పాటిమీద హనుమంతరావు ఆధ్వర్యంలో చికెన్ బిర్యాని, మిఠాయిలను పంపిణీ చేశారు. గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు, తెలుగు యువత నాయకులు గోగినేని మధు ఆధ్వర్యంలో పోషకాహార పంపిణీ చేశారు.

ఆగిరిపల్లి: ఒట్టిగుడిపాడులో టీచర్ ఇందిరా నాగభూషణం సహాయంతో ఎంఈవో సర్వేశ్వరరావు, కొవ్వలి ఆనంద్ చేతులమీదుగా విద్యార్థులకు భోజనం అందించారు. ఈదులగూడెంలో సర్పంచ్ భర్త చిట్నేని శేషగిరిరావు సహాయంతో పిల్లలకు నాన్ వెజ్ భోజనాలు, ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విజయవాడ వాస్తవ్యులు శోభనాచల గుప్త సహాయంతో విద్యార్థులకు అరటి పళ్ళు, అలాగే ఈదర హైస్కూల్లో సర్పంచ్ అనిత, ఏనుపాదం ఆధ్వర్యంలో ఆగిరిపల్లి కొండకాలనీ విద్యార్థులకు హెడ్ మాస్టర్ కె.రాణి, రత్నకుమారి సొంత ఖర్చులతో భోజనం ప్లేట్లు, బుక్స్ అరటిపళ్ళు, అమ్మవారిగూడెంలో దాతల సాయంతో విందు భోజనం ఏర్పాటు చేశారు.


ఆరుతెగలపాడులో పుస్తకాలు, తాడినాడ హైస్కూల్ భోజనాల పంపిణీ

కైకలూరు: పాఠశాలల్లో విద్యా వారోత్సవాలు ముగింపు సందర్భంగా శుభ్ దిన్ తిథి పేరిట దాతల సహకారంతో విద్యార్థులకు విందు భోజనాలు ఏర్పాటు చేసినట్టు హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం వేమవరప్పాడు ఎంపీ యూపీ స్కూల్లో, శ్రీరంగాపురంలోని ఎంపీపీ స్కూల్లో శిక్షా-సప్తాహ్ నిర్వహించారు. రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి అడవి ప్రసాద్ ఆర్థిక సాయంతో విందు భోజనాన్ని అందజేశారు. శ్రీరంగాపురం హెచ్ఎం కిరణ్, పాధ్యాయులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


బొమ్మినంపాడులో.. ఆగిరిపల్లిలో

ముదినేపల్లి: బొమ్మినంపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు టీడీపీ మండల ఉపాధ్యక్షులు యర్రా రాంబాబు స్వీట్లు పంచారు. ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు బేతాళ రాజేంద్ర ప్రసాద్, సాయి లక్ష్మి, కుమార స్వామి, గొట్టిపాటి రమేష్ తదితరులు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.


మండవల్లి మండలంలో..

మండవల్లి: అయ్యవారి రుద్రవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పిచ్చేడు విద్యార్థులకు అరటిపండ్లు అందించారు. పసలపూడిలో సర్పంచ్ ఉచ్చుల కృష్ణారావు, మాజీ సర్పంచ్ ఉచ్చుల నిర్మల ఆర్థిక సాయంతో పౌష్టికాహారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వై సత్యనారాయణ పాల్గొన్నారు. అల్లినగరం ప్రాథమిక పాఠశాలలో టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో పౌష్టికాహారం అందించారు.

కలిదిండి: ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఎంఈవో ప్రభాకర్ బాబు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం శుభదిన్ కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో విద్యార్థులకు భోజనంతో పాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, సర్పంచ్ స్వర్ణ కుమారి, పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. శుభ్‌దిన్‌లో భాగంగా తాడినాడ, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనంతోపాటు పండ్లు, మిఠాయిలను దాతలు పంపిణీ చేశారు. పెదలంక జడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు.

ఆదుకోండి..

లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సకు రూ.40 లక్షలు

తమ కుమార్తె ప్రాణం కాపాడాలంటూ అభ్యర్థన


చికిత్స పొందుతున్న విద్యార్థిని జ్ఞానేశ్వరి

ఏలూరు అర్బన్, జూలై 29 : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. సాయంకోసం దాతల సహాయాన్ని అర్థిస్తోంది. ఏలూరు కొత్తపేట ఐకేపీ భవన్-2 సచి వాల యంలో పనిచేస్తున్న ఏఎన్ఎం కోటం దుర్గ ఏకైక కుమార్తె జ్ఞానేశ్వరి (14)కి కామెర్లు ముదరడంతో లివర్‌మార్పిడి జరగాల్సి ఉందని వైద్య నిపుణులు నిర్ధారించారు. జ్ఞానేశ్వరి ప్రస్తుతం ఏలూరులోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. దుర్గ భర్త ఓ కేటరింగ్ సెంటర్‌లో దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామానికి చెందిన ఏఎన్ఎం దుర్గ ఏలూరులో విధులు నిర్వర్తిస్తున్నారు. జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత దుర్గకు లేదు. ప్రభుత్వ సాయం కోసం కూడా ప్రయత్నించింది. సమయం మించి పోతుండటంతో ఆర్థిక సాయం కోసం అందరినీ ఆశ్రయిస్తోంది. రెండు రోజుల్లోగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకపోతే ప్రాణానికే ప్రమాదమని విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యులు తేల్చిచెప్పారు. ఈ చికిత్స జరగాలంటే రూ.40 లక్షలు ఖర్చవుతుందని అంత స్తోమత లేక ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో సాయం కోరుతున్నారు. డీఎం హెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు కొందరు తమకు తోచినంత సాయం అందజేశారు. తన కుమార్తె చికిత్సకు సహకరించి ప్రాణం నిలపాలని ఏఎన్ఎం దుర్గ అర్థిస్తోంది. దాతలు తమ సాయాన్ని ఫోన్‌పే నెంబరు 96767 92602కు పంపి ఆదుకోవాలని కోరుతోంది.

యువతలో నైపుణ్యాన్ని గుర్తించాలి : ఎంపీ మహేష్



ఏలూరు రూరల్, జూలై 29: యువతకు ఉపాధి, నైపుణ్యత పెంపుపై పార్లమెంట్‌లో మొదటిసారి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తన గళాన్ని వినిపించి ఆకట్టుకున్నారు. పార్లమెంట్ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో 85వ ప్రశ్నకు ఏలూరు ఎంపీ మాట్లాడుతూ యువతలో నైపుణ్యత పెంచి, ఉపాధి ప్రోత్సాహకాలను ప్రకటించిన ఆర్థికమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫలమైందన్నారు. నిరుద్యోగం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉందని యువత సామర్థ్యాన్ని గుర్తించేందుకు ఏపీలో స్కిల్ సెన్సస్ చేస్తున్నారని స్పష్టం చేశారు. దేశ జనాభాలో 5వ వంతుపైగా ఉన్న పట్టభద్రులు, యువతలో నైపుణ్యతను గుర్తించే చర్యలు కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదా? లేదా? అని కేంద్ర మంత్రి నుంచి తెలుసుకుంటున్నానని పేర్కొన్నారు. దీనికి సంబంధించి కేంద్ర కార్మిక, ఉపాధిశాఖా మంత్రి మన్‌షుక్ మాండివ్యా మాట్లాడుతూ యువతకు ఉపాధి కోసం నైపుణ్యం చాలా అవసరమని మంచి ప్రశ్న వేసిన ఎంపీ ఆయన అభినందించారు.

స్కూల్‌గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 29 : జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ (అండర్-14,17) సెక్రటరీ పోస్టు భర్తీకి ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఫిజికల్ డైరెక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రక టనలో తెలిపారు. పోస్టు రెండేళ్ల కాలపరిమితికి మాత్రమే ఉంటుందన్నారు. మహిళా అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత పాఠశాల హెచ్ఎం సిఫారసుతో ఆగస్టు రెండో తేదీలోగా ఏలూరు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

ముందు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శర్మిష్ట



చాట్రాయి, జూలై 29: ముందు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శర్మిష్ట అన్నారు. చనుబండలో ఎక్కువ మంది ప్రజలు సీజనల్ జ్వరాలు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీపీ కందుల కృష్ణ మంత్రి పార్థసారథి దృష్టికి తేవటంతో ఆయన ఆదేశాలతో సోమవారం చనుబండలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో గ్రామంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి సమీపాన పేడ కుప్పలు వేయవద్దని, కాచి చల్లార్చిన నీరు తాగాలని ప్రజలకు సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి వైద్యులకు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వర్షా కాలం రాగానే డ్రెయిన్లు శుభ్రం చేయించి, ఆవాస ప్రాంతాల్లో మురుగు, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూస్తే దోమలు పుట్టవన్నారు. దోమలు ఎక్కువ అయితే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. తాగునీరు కలుషితం అయితే డయేరియా వస్తుందని, చనుబండలో జ్వరం ఉన్న వారిని గుర్తించటానికి ఇంటింటి సర్వే జరుగుతున్నదని, జ్వరాలు తగ్గే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఆమె వెంట డ్యిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ, జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి వైద్య, జిల్లా బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు దేవదాయశాఖ మంత్రితో కామినేని భేటీ

ముదినేపల్లి, జూలై 29 : సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని శ్రీ సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయ భూముల సమస్యలపై చర్చించేందుకు మంగళవారం విజయవాడలో ఉన్నత స్థాయి సమావేశంలో జరుగనుంది. ఈ దేవస్థానం భూముల సర్వీస్ ఈనాం వ్యవహారాలు, కౌలు సొమ్ము పెండింగ్ సమస్యలపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమావేశమై చర్చించనున్నారు.


మాజీ సైనికుడ్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని

సైనికుల త్యాగాలు మరువలేనివి : కామినేని

కైకలూరు జూలై 29 : కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కార్గిల్ విజయ దివస్ 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న డేవిడ్‌రాజ్‌ను కైకలూరులో ఘనంగా సత్కరించారు. కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, కేవీఎస్ఎం నాయుడు, ఎండీ జానీ, ఉలవల రామారావు, కేశిరెడ్డి బలరాం, సూరి తదితరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన..

ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధిస్తారని ఎమ్మెల్యే కామినేని అన్నారు. సోమవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందిన పుస్తకాలను పంపిణీ చేశారు. కళాశాలలో విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వారిని అరెస్టు చేసి వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించాలని స్థానిక పోలీసులను ఆయన ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో వాటర్ ప్లాంట్ తక్షణమే మరమ్మ తులు నిర్వహించి పిల్లలకు సురక్షితమైన మంచినీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలుగుయువత నాయకుడు పూల రామచంద్రరావు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండుగప్ప చెర్వుల్లో రొయ్యల వ్యర్థాలు నిషేధించాలి

కలిదిండి, జూలై 29 : ఉప్పుటేరు తీర గ్రామాల్లో పండుగప్ప చెరువుల్లో రొయ్యల వ్యర్థాలు వేయటాన్ని నిషేధించాలని రొయ్యల సాగు రైతులు సోమవారం మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కొండంగి, మట్టగుంట గ్రామాల్లో పండుగప్పలకు ఆహారంగా రొయ్యల వ్యర్థాలను వేయటంతో నీరు కలుషితమవడంతోపాటు చుట్టుపక్కల చెరువుల్లో రొయ్యలకు వైరస్ సోకి చనిపోవడంతో నష్టపోతున్నామని పేర్కొన్నారు. రొయ్యల కంపెనీల నుంచి వ్యానులపై కొందరు దళారులు వ్యర్థాలను తీసుకొచ్చి పండుగప్ప సాగు రైతులకు విక్రయిస్తున్నారని, పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు.

యూనిఫాం పంపిణీ చేసిన కూటమి నాయకులు



ముదినేపల్లి, జూలై 29 : ముదినేపల్లి మండ లంలోని 67 ప్రభుత్వ పాఠశాలల 3676 మంది విద్యార్థులకు యూని ఫామ్, పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేశారు. సోమవారం మండలంలోని వివిధ పాఠ శాలల్లో సర్పంచ్‌లు, కూటమి నాయకులు యూనిఫామ్, పుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. బొమ్మినంపాడు కొత్త దళితవాడ పాఠశాలలో కూటమి నాయకులు యర్రా రాంబాబు, బాసినశెట్టి కిషోర్, దాసి సుబ్బారావు, బుచ్చి బాబు, నవీన్, హెచ్ఎం బేతాళ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

ముసునూరు, జూలై 29: చెక్కపల్లి పంచాయతీలో ప్రధాన, అంతర్గత రహదారులకు ఇరువైపులా డ్రైనేజీ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ టి. రాధిక అన్నారు. సోమవారం చెక్కపల్లి - అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారి, ఎస్సీ కాలనీలో ఎక్స్‌కవేటర్ సాయంతో డ్రెయినేజీలో పూడిక తొలగించి, రహదారిపై ఉన్న వర్షపునీరు, మురుగునీరు లేకుండా చర్యలు చేపట్టారు. పనులను సర్పంచ్ భర్త సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధర్మేంద్ర పర్యవేక్షించారు.


ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

దేవస్థానం భూముల ఆక్రమణలు తొలగిస్తాం

నూజివీడు టౌన్, జూలై 29: దేవస్థానం భూముల ఆక్రమణలను తొలగించేందుకు త్వరలో చర్యలు చేపడతామని కాకినాడ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. నూజివీడులో కోట మహిషా సురమర్దిని ఆలయం, వేంకటాచల స్వామి ఆలయాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవస్థానం ముఖ మండపం మరమ్మతులు నిర్వహించాల్సి ఉందని, అదే విధంగా వేంకటాచల స్వామి ఆలయ భూములు 350 ఎకరాలు ఆక్రమణలో ఉన్న దృష్ట్యా ఆక్రమణ తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. నూజివీడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో అలివేణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి



కైకలూరు జూలై 29 : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో పయనించి ఉన్నత స్థితికి చేరుకోవాలని కైకలూరు సీనియర్ న్యాయాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. సోమవారం కైకలూరు విద్యాంజలి డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ సయ్యద్ జమీల్ అహ్మద్, న్యాయవాదులు పి. పవన్‌కాంత్, జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సంరక్షణే లక్ష్యం

ముసునూరు, జూలై 29: మహిళలు, బాలికల సంరక్షణే మిషన్ శక్తి లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీవో నూరాని అన్నారు. సోమవారం ముసునూరు వెలుగు కార్యాలయంలో బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికల సంరక్షణపై వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లాకు ఒకటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. బేటీ బచావో-బేటీ పడావో, బాల్య వివాహాలు నిషేధిత చట్టం, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. సూపర్‌వైజర్లు కె.ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హిందూ ధర్మ సమితి బెంచీల వితరణ

మండవల్లి జూలై 29 : హిందూ ధర్మ సమితి ఆధ్వర్యంలో మండలంలోని ప్రధాన కూడళ్లలోనూ, ఆలయాల వద్ద ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు సోమవారం ఏర్పాటు చేశారు. మండలంలోని లింగాల, పెరికేగూడెం, అయ్యవారి రుద్రవరం గ్రామాల్లోని శివాలయాల వద్ద, గన్నవరం, మండవల్లి రామాలయం, అంజనేయస్వామి ఆలయాల వద్ద, మండవల్లి స్టేషన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడి వద్ద, అయ్యవారి రుద్రవరం గ్రామానికి వెళ్లే దారిలో వీటిని ఏర్పాటు చేశారు. సమితి సభ్యులు పాల్గొన్నారు.

వెదజల్లితే లాభాలే..

- సొమ్ము, సమయం ఆదా
- వరిసాగులో వెదజల్లే పద్ధతిపై రైతుల మొగ్గు


చీపురుగూడెంలో వెదజల్లే పద్ధతిలో వరి సాగు

చాట్రాయి, జూలై 29: ఇటీవల కాలంలో రైతులు వరిసాగులో వెదజల్లే పద్ధతిపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పద్ధతిలో సాగుచేసిన రైతులు సత్ఫలితాలు సాధిస్తుండటంతో దీనిపై ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అధికారిక లెక్కల ప్రకారం మండలంలో చనుబండ, నరసింహారావుపాలెం, సి. గుడిపాడు, కోటపాడు, చీపురుగూడెం తదితర గ్రామాల్లో 1500 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు జరిగింది. వరి నాట్లు సీజన్‌లో కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీలతో పనిలేకుండా పంటలు పండించుకోటానికి వెదజల్లే పద్ధతిపై రైతులు మొగ్గుచూపిస్తున్నారు. ఈ పద్ధతిలో వరి నాట్లు కూలి, దమ్ము, ఎరువుల ఖర్చు ఎకరానికి రూ. 10 వేల వరకు తగ్గుతుందని, దిగుబడులు నాట్లు వేసిన పొలంతో సమానంగా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. భవిష్యత్తులో వరిసాగు మొత్తం వెదజల్లే పద్ధతిలో జరిగే అవకాశం కన్పిస్తున్నది.

దిగుబడుల్లో తేడా లేదు!

వరిసాగులో కూలీల కొరత కారణంగా ఇబ్బందులు పడలేక వెదజల్లే పద్ధతి అనుసరిస్తూ లాభాలు పొందుతున్నాం. ఈ విధానంలో వరి నాట్లు కూలీలు, దమ్ము, ఎరువులు ఖర్చు ఎకరానికి రూ. 10 వేల వరకు పెట్టుబడి ఆదా అవుతున్నది. దిగుబడుల్లో బస్తా కూడా తేడా లేదు.

- చీకటి శ్రీనివాసరావు, రైతు, చీపురుగూడెం

ఎకరాకు రూ. 10 వేలు ఆదా

ఈ పద్ధతిలో ఎక్కువ ఎకరాలను తక్కువ సమయంలో వెదజల్ల వచ్చు. విత్తనాలు పొలంలో నేరుగా చల్లటం వలన వేరు వ్యవస్థ గట్టిగా ఏర్పడి, పంట పడిపోకుండా ఉంటుంది. కలుపు యాజమాన్యం కూడా సులభం. రైతుకు ఎకరానికి రూ. 10వేలు ఆదా అవుతుంది.

- శివశంకర్, ఏవో, చాట్రాయి మండలం.


స్వాధీనం చేసుకున్న ఎరువులు, పురుగు మందులతో అధికారులు

ఎరువులు, పురుగు మందుల సీజ్

చాట్రాయి, జూలై 29: మండలంలోని తుమ్మగూడెంలో లైసెన్స్ లేకుండా ఎరువులు, పురుగు మందులు అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో మాదాల బెనర్జీ గోడౌన్‌లో సోమవారం రాత్రి విజిలెన్స్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రూ 1.27 లక్షల విలువైన 59.36 లీటర్ల పురుగు మందులు, రూ. 57,915 విలువైన 1480 కేజీల ఎరువులు సీజ్ చేశారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి. శివరామకృష్ణ తెలిపారు. విజిలెన్స్ ఏవో సురేష్, మండల ఇన్‌చార్జి ఏవో చెన్నారావు, రెవెన్యూ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

16 అర్జీల స్వీకారం

నూజివీడు టౌన్, జూలై 29: నూజివీడు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో మొత్తం 16 అర్జీలు దాఖలు అయినట్లు ఏవో తేజోమయి తెలిపారు. గడువులోగా సంబంధిత శాఖల అధికారులు నిబంధనల ప్రకారం సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

రహదారి మార్జిన్‌పై ఆక్రమణ తొలగించండి

ముసునూరు, జూలై 29: వలసపల్లి-గుళ్ళపూడి ఆర్‌అండ్‌బీ రహదారి మార్జిన్‌పై ఆక్రమణను తొలగించాలని టీడీపీ నాయకులు, రైతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ జవహర్ బాజీకి ఆర్జీ అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు మందలపు బుజ్జియ్య, నాయకుడు బోగోలు సత్యనారాయణ మాట్లాడుతూ ఒక రైతు రహదారి మార్జిన్‌ను ఆక్రమించి తన పొలంలో కలుపుకున్నాడని, దీంతో రహదారిపైనే నీరు ప్రహించడంతో కోతకు గురై, పక్కన ఉన్న పంట చేలపై వరదనీరు చేరడంతో పంటలు నష్టపోతున్నామని, తక్షణమే ఆక్రమణను తొలగించి, రోడ్డు కోతకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు బోగోలు నాగేశ్వరరావు, పి.రామకృష్ణ, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

ముసునూరు, జూలై 29: రాష్ట్రంలో అమలు చేసిన విద్యా రంగ సంస్కరణల ఫలితంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, నూతన ప్రభుత్వం చక్కదిద్దాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు, మండల అధ్యక్షులు జి.పద్మకిషోర్‌లు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో పద్మావతి దేవి, తహసీల్దార్ జవహర్ బాజీ, ఎంఈవో సుబ్బారావుకు యూటీఎఫ్ నాయకులు 20 సమస్యలతో కూడిన వినతిపత్రాలు సోమవారం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు సీహెచ్ జాకబ్‌రాజు, జి.రాంబాబు, ఎస్. నారాయణ, డి.బెనర్జీ, మాణిక్యాలరావు, వాణి, రత్నమాల, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యంపైనే ప్రధాన దృష్టి

ఆగిరిపల్లి, జూలై 29: ఎంపీడీవో శామ్యూల్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నామ్‌కే వాస్తేగా జరిగింది. సభ్యులు, అధికారులు నామమాత్రంగానే పాల్గొన్నారు. పారిశుధ్యంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నామని పంచాయతీ ఈవో, మండలంలోని ఇతర పంచాయతీ సిబ్బంది తెలిపారు. శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మండలంలోని వాటర్ ట్యాంకులు నెలరోజులకొకసారి శుభ్రం చేస్తున్నామని గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం చల్లించి డ్రైనేజీలు శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ గోళ్ళ అనూష, జడ్పీటీసీ వీరబాబు, ఎంపీడీవో శామ్యూల్, ఈవో పీఆర్డీ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల వితరణ



ముసునూరు, జూలై 29: కొర్లకుంట పంచాయితీ పరిధిలోని ఎంపీపీ, ఎంపీ యూపీ పాఠశాలల్లో విద్యార్థులకు టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆవుల బాబూరావు భోజనం ప్లేట్లను సోమవారం బహూకరించారు. రూ. 10 వేల విలువగల భోజనం ప్లేట్లను తన తల్లి ఆవుల మంగమ్మ స్మృత్యర్థం 110 మంది విద్యార్థులకు సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణతో కలిసి దాత అందజేశారు. హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.